క్లుప్తంగా

ఘనంగా నాగుల పంచమి



నాగులకట్ట వద్ద ప్రత్యేక పూజలలో మహిళలు

పులివెందుల టౌన్ : పట్టణంలో నాగులచవితి పండుగను పురస్కరించుకుని మంగళవారం నాగ పంచమి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. నాగులచవితి రోజున ఉపవాస దీక్షలు చేపట్టిన మహిళలు నాగపంచమి సందర్భంగా పుట్టకు పాలుపోసి ఉపవాస దీక్షను విరమించారు. పుట్టలో పాలు పోసి కొబ్బెర, బెల్లం నైవేద్యంగా పెట్టి టెంకాయలు కొట్టి నూలు ధారాలను కంకణాలుగా ధరించారు. పట్టణంలోని మిట్టమల్లేశ్వరస్వామి ఆలయంలోని నాగులకట్ట వద్ద, పీడబ్ల్యూ కాలనీ, సాయిబాబా ఆలయం, నాగులకట్ట తదితర ప్రాంతాల్లో ఉన్న పుట్టల వద్ద భక్తులు పుట్టలలో పాలు పోసి తమ భక్తిని చాటుకున్నారు.

14 ఏళ్లలోపు పిల్లలను పనుల్లో పెట్టుకోవద్దు

కమలాపురం : 14 ఏళ్ల లోపు పిల్లలను పనుల్లో పెట్టుకోవద్దని, అలా పనుల్లో పెట్టుకున్న దుకాణాల యజమానులపై కూడా చర్యలు తప్పవని సీఐ ఎస్‌కేరోషన్, ఎస్‌ఐ విద్యాసాగర్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం కమలాపురం పట్టణంలో పాఠశాలలకు వెళ్లకుండా దుకాణాలలో పనులు చేసే 14 ఏళ్లలోపు పిల్లలను గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. చిన్నారుల తల్లిదండ్రులు, దుకాణాల యజమానులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇలా పిల్లలను బడికి పంపకుండా పనులకు పంపించడం సరికాదన్నారు. చదువుకోవడానికి ఇబ్బంది పడుతుంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రమణ, పోలీస్ సిబ్బంది, తల్లిదండ్రులు, దుకాణాదారులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ ఎన్నికలకు సర్వం సిద్ధం



పులివెందుల ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకున్న పోలింగ్ బాక్స్‌లు

పులివెందుల రూరల్ : పులివెందుల జెడ్పీటీసీ స్థానానికి సంబంధించి ఆగస్టు 12న ఓటింగ్ నిర్వహించనున్నారు. ఇప్పటికే ఎన్నికల సంఘం కూడా జెడ్పీటీసీ స్థానానికి ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. నేటి నుంచి నామినేషన్లు స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఆగస్టు 12 జరిగే పోలింగ్‌కు పులివెందుల మండల వ్యాప్తంగా రాగిమానుపల్లె, ఎర్రిపల్లె, అచ్చివెల్లి, ఎర్రబల్లె, కనంపల్లె, కొత్తపల్లె గ్రామాల్లో 15 పోలింగ్ కేంద్రాలను సంబంధిత అధికారులు ఎంపిక చేశారు. మొత్తం ఓటర్లు 10,601 మంది ఉన్నారు. ఆగస్టు 12న ఓటింగ్, 14న కౌంటింగ్ ఉంటుందని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. జెడ్పీటీసీ ఎన్నికకు సంబంధించి 19 పోలింగ్ బాక్స్‌లు రాగా, అందులో 15 పెద్దవి, మిగిలిన చిన్న బాక్స్‌లు ఎంపీడీఓ కార్యాలయానికి రావడం జరిగిందన్నారు.

వానరానికి అంత్యక్రియలు



వానరానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న స్థానికులు

వేంపల్లె : స్థానిక సాయిబాబా ఆలయంలో మంగళవారం ప్రమాదవ శాత్తు మృతి చెందిన గంగ్రంగి జాతికి చెందిన వానరానికి బీజేపీ నాయకులు స్థానికులతో కలసి నివాళులర్పించి అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానికులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి

చక్రాయపేట : దేవుడి రథం కింద పడి మృతి చెందిన పులివెందుల జడ్పీటీసీ సభ్యుడు మహేశ్వరరెడ్డి కుటుంబానికి అన్ని పార్టీల నేతలు సహకారం ఇవ్వాలని చక్రాయపేట జడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డి కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ పులివెందుల జడ్పీటీసీ ఎన్నికకు నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా అన్ని పార్టీలకు చెందిన నేతలు మానవతా దృక్పథంతో ఆలోచించి మహేశ్వర రెడ్డి కుటుంబ సభ్యులను ఏకగ్రీవంగా జడ్పీటీసీని చేస్తే మంచి దన్నారు. ఇదే అన్ని రాజకీయ పార్టీల నేతలు ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు.

ప్రారంభమైన భాగవత పఠనం

సింహాద్రిపురం : మండలంలోని కసనూరు గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో మంగళవారం భాగవత పఠనం ప్రారంభమైంది. ఈ సందర్భంగా పులివెందుల భాగవత భక్త సమాజ మండలి ఆధ్వర్యంలో దాతలు, గ్రామస్తుల ఆధ్వర్యంలో భాగవత పఠన కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

పులివెందుల బ్రాంచ్ కెనాల్ నిర్వహణ అస్తవ్యస్తం

- సిబ్బంది కొరతతో కుంటుపడుతున్న పనులు
- లష్కర్లు లేక నీటి విడుదలలో జాప్యం
- ఉప కాలువలపై కొరవడిన పర్యవేక్షణ



కంపచెట్లతో నిండిన ఉప కాలువ



పీబీసీ కాలువ రహదారిపై నిండిన కంపచెట్లు

వేముల : పులివెందుల బ్రాంచ్ కెనాల్ నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. ఈ ప్రాంత రైతులకు పులివెందుల బ్రాంచ్ కెనాల్ ఆయువు పట్టు. ఈ కాలువ కింద ఉన్న పొలాలను ఆయకట్టుగా మార్చడమే దీన్ని ముఖ్య ఉద్దేశ్యం. అయితే గత కొన్నేళ్లుగా పులివెందుల బ్రాంచ్ కెనాల్ నీటి నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. ఈ కెనాల్ ఉప కాలువల కింద రైతులు పంటలు సాగు చేసుకున్నారు. వర్షాభావంతో వర్షాలు లేక ఉప కాలువలకు నీరు రాకపోవడంతో సాగులో ఉన్న పంటలకు నీరు అందించలేకపోతున్నారు. పులివెందుల బ్రాంచ్ కెనాల్‌కు నీరు విడుదల చేసినా ఉప కాలువలకు నీరు వెళ్లడంలేదు. పీబీసీ కాలువ పూడికతో నిండిపోవడంతో దిగువకు నీరు సకాలంలో చేరడంలేదు. దీనివలన పంటలకు సాగునీరు అందించడంలో ఆలస్యమవుతోందని రైతులు వాపోతున్నారు.

సిబ్బంది కొరతతో కుంటుపడుతున్న పనులు

పులివెందుల బ్రాంచ్ కెనాల్ నిర్వహణలో సిబ్బంది కొరత వేధిస్తోంది. పులివెందుల బ్రాంచ్ కెనాల్ 68 కి.మీ మేర ఉంది. ఈ కాలువను 5 సబ్ డివిజన్లుగా విభజించారు. పార్నపల్లె డ్యాం రెండు సబ్ డివిజన్లుగానూ, అంకాలమ్మ గూడూరు ప్రాంతం ఒక సబ్ డివిజన్‌గా, పులివెందల ప్రాంతం రెండు సబ్ డివిజన్లుగా విభజించారు. ఈ పులివెందుల బ్రాంచ్ కెనాల్‌ను ఒక డివిజన్‌గా పరిగణిస్తారు. ఈ డివిజన్‌లో తగినంత సిబ్బంది లేరు. దీంతో పనులు కుంటుపడుతున్నాయని అందులో పనిచేస్తున్న అధికారులు చెబుతున్నారు. డివిజన్‌లో 10 మంది వర్క్ ఇన్‌స్పెక్టర్లు పనిచేయాల్సి ఉండగా, ఇద్దరు వర్క్ ఇన్‌స్పెక్టర్లు మాత్రమే పనిచేస్తున్నారన్నారు. డివిజన్‌కు 17 మంది ఏఈలు పనిచేయాల్సి ఉండగా నలుగురు ఏఈలు మాత్రమే పనిచేస్తున్నారు. పూర్తిస్థాయి సిబ్బంది లేకపోవడంతోనే పనులు కుంటుపడుతున్నాయని పీబీసీ అధికారులు అంటున్నారు.

లష్కర్లు లేక నీటి విడుదలలో జాప్యం

పులివెందుల బ్రాంచ్ కెనాల్ కింద పూర్తిస్థాయిలో లష్కర్లు లేకపోవడంతో నీటి విడుదలలో జాప్యం అవుతోందని అధికారులే అంటున్నారు. పులివెందుల బ్రాంచ్ కెనాల్ కింద 34 మంది లష్కర్లు పనిచేయాల్సి ఉండగా, 10 మంది లష్కర్లు మాత్రమే పనిచేస్తున్నారు. పీబీసీ నిర్వహణలో లష్కర్ల పాత్ర కీలకం. కెనాల్ వెంబడి కంపచెట్లు పెరిగిపోయాయి. దీంతో పీబీసీ కాలువ వెంబడి మొబైల్ వాహనాలు వెళ్లడం లేదని అధికారులు అంటున్నారు. అదే లష్కర్లు పూర్తిస్థాయిలో ఉంటే పీబీసీ వెంబడి ఉన్న కంపచెట్లు తొలగించే పనులు చేసేవారు. పీబీసీ కాలువ వెంబడి ఉప కాలువలకు నిర్దేశించిన సమయం ప్రకారం నీటిని విడుదల చేసేవారు. దీంతోనే లష్కర్లు లేక సకాలంలో నీటి విడుదలలోనూ జాప్యం జరుగుతోందని పీబీసీ అధికారులు అంటున్నారు.

> **సిబ్బంది కొరత వాస్తవమే**
>
> పులివెందుల బ్రాంచ్ కెనాల్‌కు సిబ్బంది కొరత వాస్తవమే. ఇటీవల 10 మంది సిబ్బంది రిటైర్మెంట్ అయ్యారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లు, లష్కర్లు తగినంత సిబ్బంది లేరు. అయినప్పటికి పీబీసీ కాలువకు నీటిని వదులుతాం. పంటలు ఎండిపోకుండా చూస్తాం. పీబీసీ కాలువ నిర్వహణ బాధ్యతగా నిర్వహిస్తున్నాం.
>
> – వెంకట రామయ్య, పీబీసీ ఇన్‌చార్జి ఈఈ, పులివెందుల

ఉపకాలువలపై కొరవడిన పర్యవేక్షణ

పీబీసీ కాలువ వెంబడి ఉన్న ఉప కాలువలపై సిబ్బంది పర్యవేక్షణ కొరవడింది. పీబీసీ నుంచి నీటిని విడుదల చేశాక ఉప కాలువల వెంబడి నీటి ప్రవాహాన్ని పర్యవేక్షించాలి. నీరు ఎక్కడైనా లీకేజీ అవుతోంది, కాలువ నీరు వాగులు, వంకలలోకి వెళుతోందా అనే విషయాలపై సిబ్బంది పర్యవేక్షించాలి. కానీ నీటిని విడుదల చేశాక కాలువ వెంబడి పర్యవేక్షిస్తున్న అధికారులు కనిపించడంలేదు. నీటి వదిలితే తమ పని అయిపోయిందనే దోరణిలో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాగులో ఉన్న పంటలను సంరక్షించడం కోసమే వదలని నీరు పంటలకు అందుతోందా, దుబారా అవుతున్నాయో తెలియని పరిస్థితి నెలకొంది.

పీబీసీ ప్రధాన అధికారి ఇన్‌చార్జే

పులివెందుల బ్రాంచ్ కెనాల్‌కు ఇన్‌చార్జి కార్యనిర్వాహణాధికారిగా వ్యవహరిస్తున్నారు. ఇక్కడ రెగ్యులర్ కార్యనిర్వాహణాధికారి లేకపోవడం కూడా సాగునీరు సకాలంలో విడుదలకు కారణమవుతోందని రైతులు అంటున్నారు. పీబీసీ కాలువకు పూర్తిస్థాయి కార్యనిర్వాహణాధికారి ఉన్నట్లయితే కాలువ వెంబడి పర్యవేక్షించి ఎక్కడ సమస్యలు ఉన్నాయో గుర్తించి వాటిని పరిష్కరించి నీటిని విడుదల చేసేవారు. అయితే ఇన్‌చార్జి అధికారి కావడంతో పీబీసీ కాలువ నిర్వహణ బాధ్యతలు భారమవుతున్నాయి.

నేడు అరాధనోత్సవం

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లెలోని శ్రీనారాయణస్వామి దివ్య మందిరంలో బుధవారం 25వ శ్రీఅవధూత నారాయణ స్వామి ఆరాధనోత్సవం నిర్వహించనున్నట్లు భక్త బృందం తెలిపారు. బుధవారం 7 గంటలకు పూజ, తీర్థ ప్రసాదాలు, అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం బ్రాహ్మణపల్లె, వి.కొత్తపల్లె, నల్లపురెడ్డిపల్లె గ్రామాల కళాకారులచే భజన కార్యక్రమాలు, రాత్రి 8 గంటలకు గాలివీడు డాక్టర్ నాగేశ్వర బృందం శ్రీహరినాట్య కళామండలి కళాకారులచే చెంచులక్ష్మి నాటక ప్రదర్శన ఉంటుందన్నారు.

బలవంతపు భూసేకరణ ఆపాలి

జమ్మలమడుగు : సోలార్ ప్రాజెక్టు నిర్మాణం కోసం యాజమాన్యం రైతుల వద్దనుంచి బలవంతపు భూసేకరణలు ఆపాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పెద్దముడియం మండలంలోని కల్వటాల గ్రామంలో సీపీఎం, రైతు సంఘం నాయకులు పర్యటించి గ్రామ రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోలార్ భూసేకరణ 2013 చట్టం అమలు చేసి సోలార్ యాజమాన్యం రైతుల వద్ద నుంచి లీజు విధానం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల వద్ద నుంచి భూములు సేకరించిన యాజమాన్యం మిగతా రైతులకు రహదారి వదలకుండా పూర్తిగా రహదారులను మూసివేసి రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. భూములు కొల్పోయిన రైతులకు రూ.20 లక్షల పరిహారం ఇచ్చి బాధిత కుటుంబాలకు ఉద్యోగం కల్పించాలన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మనోహర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, శివనారాయణ, దాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ మాస ఉత్సవాలకు ఆహ్వానం



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను గండి ఉత్సవాలకు ఆహ్వానిస్తున్న పాలకమండలి బృందం

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో జరిగే శ్రావణ మాస ఉత్సవాలకు రావాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలసి ఆహ్వాన పత్రిక అందజేసినట్లు ఆలయ చైర్మన్ కావలికృష్ణతేజ తెలిపారు. మంగళవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో పాలక మండలి సభ్యులతో కలసి ఆహ్వాన పత్రికను ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా ఆయన గండిక్షేత్రంపై ఇటీవల కొంత కాలంగా జరుగుతున్న సంఘటనలను అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ ఉపప్రధాన అర్చకుడు రాజారమేష్ ఆయన్ను ఆశీర్వదించి ప్రసాదాలను అందజేశారు. జగన్‌ను కలసిన వారిలో పాలక మండలికి చెందిన బిందుసాగర్, బ్రంహానందరెడ్డి, మధు, శ్రీనివాసులరెడ్డి, కొండారెడ్డిలు ఉన్నారు.

ఉచిత న్యాయ సహాయం సద్వినియోగం చేసుకోండి

కమలాపురం : పలు కేసుల్లో జైళ్లలో రిమాండ్ ఖైదీలుగా ఉన్న వారు ఉచిత న్యాయ సహాయం కోసం ఏర్పాటు చేసిన 15100 ను సద్వినియోగం చేసుకోవాలని సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప బాబాఫక్రుద్దీన్ తెలిపారు. సోమవారం ఆయన కమలాపురం సబ్ జైలులోని లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను విజిట్ చేసి రిజిష్టర్లను పరిశీలించి రిమాండ్‌లో ఉన్న ఖైదీలతో మాట్లాడారు. ఏ కేసులో జైలుకు వచ్చారు.. తదితర వివరాలపై ఆరా తీశారు. లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను ఖైదీలకు వివరించారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఖైదీల ఆరోగ్యంపై సబ్‌జైలు సూపరింటెండెంట్ గంగాధర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రిమాండ్ ఖైదీలుగా ఉన్న వారు ఉచిత న్యాయ సహాయంను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఖైదీలకు సమస్యలుంటే మండల న్యాయ సమితిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సబ్‌జైలు సిబ్బంది, న్యాయ వాదులు, పారా లీగల్ వలంటరీలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ, విద్యుత్ డివిజన్ అధికారులు, కార్మికులు

పులివెందుల రూరల్ : రాష్ట్రంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, సీఐటీయూ జిల్లా నాయకులు గఫూర్‌లు తెలిపారు. మంగళవారం స్థానిక విద్యుత్ డివిజన్ కార్యాలయ ఆవరణలో ఉన్న విద్యుత్ కళాక్షేత్రంలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై నిర్వహించే చలో విద్యుత్ సౌద కార్యక్రమ పోస్టర్లను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఆగస్ట్ 7వ తేదీన చలో విద్యుత్ సౌద కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యుత్ ఏడీ గురుమోహన్‌కు విద్యుత్ కార్మికులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యుత్ డివిజన్ కమిటీ అధ్యక్షుడు సిద్ధారెడ్డి, కార్యదర్శి చంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడు నాగభూషణ్‌రెడ్డి, సహాయ కార్యదర్శి సాయిరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని ఆగస్టు 7న చలో విద్యుత్ సౌదా కార్యక్రమాన్ని విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనువాసులు కోరారు. మంగళవారం స్థానిక 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి చలో విద్యుత్ సౌదా కార్యక్రమ గోడ పత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఆగస్ట్ 7న జరిగే చలో విద్యుత్ సౌదా కార్యక్రమంలో ప్రతి విద్యుత్ కాంట్రాక్టు కార్మికుడు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. అనంతరం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, విద్యుత్ సిబ్బంది విద్యుత్ ఏఈ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

భూసార పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలి



రైతులకు పొలం పిలుస్తోందిపై అవగాహన కల్పిస్తున్న ఏఓ సరస్వతి

కమలాపురం : రైతులు తాము సాగు చేసుకునే పంట పొలాల్లో ప్రతి మూడు సంవత్సరాలకు ఒక సారి లేదా మూడు పంటల కొకసారి భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని ఏఓ సరస్వతి తెలిపారు. మంగళవారం మండలంలోని పాచికలపాడు, సి.గోపులాపురం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు పంటల సాగు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన మెళకువలు తదితర అంశాలపై రైతులకు ఆమె అవగాహన కల్పించారు. రైతులందరూ తమ పొల్లాలో మూడేళ్ల కొకసారి లేదా మూడు పంటల కొకసారైన భూసార పరీక్షలు తప్పని సరిగా చేయించుకోవాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది విత్తన శుద్ధి చేసేందుకు బీజామృతం తయారీని డెమో ద్వారా తెలియజేశారు. జిగురు అట్టలు, లింగాకర్షక బుట్టల వాడకము, కషాయాల తయారీ పై అవగాహన కల్పించారు. వీఏఏ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది స్వరూప, ఇందిర రైతులు పాల్గొన్నారు.

వేములలో

వేముల : పంటలు సాగు చేసిన రైతులు తెగుళ్ల నివారణకు డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించుకోవాలని ఏఓ ఓబులేసు రైతులకు సూచించారు. మండలంలోని మబ్బుచింతలపల్లె, రాచకుంటపల్లెల్లో మంగళవారం టమోట సాగులో పొలంల పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టమోట, మిరప, అరటి పంటలకు ఎక్కువగా తెగుళ్లు సోకుతాయని, వాటి నివారణకు అధిక పెట్టుబడులు అవుతున్నాయన్నారు. దీన్ని అధిగమించాలంటే మందుల పిచికారిలో డ్రోన్ టెక్నాలజీ ఎంతో లాభసాటిగా ఉంటుందన్నారు. రాబోయే రోజులలో రోబోటిక్ వ్యవసా యం క్రియాశీలకంగా మారనుందన్నారు. ఖరీఫ్‌లో వ్యవసాయ బోర్ల కింద సాగు చేసిన వేరుశనగ పంటలో దిగుబడులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. కావాల్సిన రైతులకు జింక్ సల్ఫేట్, జిప్సం సరఫరా అయిన వెంటనే రైతులకు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సురేష్, వీహెచ్‌ఏ గోపి, రైతులు పాల్గొన్నారు.

లింగాలలో

లింగాల : మండలంలోని అంబకపల్లెలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఏఓ రమేష్ ఖరీఫ్‌లో సాగు చేసిన మిర్చి పంటను పరిశీలించి పంటలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు. అలాగే వ్యవసాయ శాఖలో సబ్సిడీతో జింక్, జిప్సం, బోరాన్‌ను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రైతు సేవా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో

చింతకొమ్మదిన్నె : ప్రతి ఉద్యాన రైతు తన పంటను ఇ క్రాప్ పోర్టల్‌లో నమోదు చేయించుకోవాలని జిల్లా ఉద్యాన అధికారి రవిచంద్రబాబు తెలిపారు. మంగళవారం ఈ పంట నమోదులో భాగంగా నాగిరెడ్డిపల్లె, చింతకొమ్మదిన్నె, రసూల్‌పల్లె రైతు సేవా కేంద్రాల పరిధిలోని రైతుల పొలాలను సందర్శించారు. కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారి కృష్ణచైతన్య, సహాయకులు సాయిలక్ష్మీ ప్రసన్న, లాలిత్య, రైతులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు హుష్.. కాకి



ప్రజలతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి



మైలవరం : మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

కమలాపురం : వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏపీ సంక్షేమ పథకాలకు కేరాఫ్‌గా ఉండేదని, ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమ పథకాల ఊసే లేదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని పి. వెంకటాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు శ్రీరాం రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ రీకాలింగ్ చంద్రబాబు మెనిఫెస్టో కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం చంద్రబాబు మెనిఫెస్టోను గుర్తుకు తెస్తూ బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ అంటూ ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచుతూ గత ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత ప్రభుత్వ పాలనకు ఉన్న తేడాను ఆయన ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఏ రాష్ట్రంలో అమలు కానన్ని సంక్షేమ పథకాలు ఏపీలో అమలు అయ్యాయన్నారు. సున్నావడ్డీ, వైఎస్సార్ ఆసరా, ఆరోగ్య భరోసా, రైతు భరోసా, జగన న్న తోడు తదితర పథకాలన్నీ ఉమయ్యాయో చంద్రబాబు ప్రజలకు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికలు ఎప్పుడు జరిగిన వైఎస్సార్ సీపీ విజయం సాధించడం తథ్యం అని ఆయన అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్త మారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, మహ్మద్‌సాదిక్, సుధా కొండారెడ్డి, శేఖర్, సుబ్బన్న, చంద్రపాల్, చంటి, విజయేంద్రారెడ్డి, కుమార్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


చంద్రబాబు మోసంతో గెలిచాడు

మైలవరం : కూటమి ప్రభుత్వం అబద్ధపు హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారం చేజిక్కించుకుందని ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తొర్రివేముల గ్రామంలో బాబు షూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను నిట్టనిలువున ముంచిందని ప్రజలకు వివరించారు. నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, బీసీలకు 50 సంవత్సరాలకు పింఛన్ పథకాలపై ఇప్పటికి వరకు ఊసేలేదన్నారు. మిరప రైతు కరెంట్ షాక్ తగిలి మృతి చెందితే చనిపోయిన వ్యక్తి భార్యకు పింఛన్ రాకపోవడంతో పాటు ఆయనకు బీమా కూడా రాలే దని వాపోయాడు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ధన్నవాడ మహేశ్వరరెడ్డి, జ డ్పీటీసీ మహలక్ష్మీ, ఎంపీటీసీ మార్తల రామ సుబ్బారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, మల్లేల గుర్విరెడ్డి, అవుల సుబ్బారెడ్డి బీసీ నాయకుడు రామాంజనేయ యాదవ్, శివగుర్విరెడ్డి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరులో..

వల్లూరు (చెన్నూరు) : సూపర్ సిక్స్ హామీలతో అన్ని వర్గాల ప్రజలను సీఎం చంద్రబాబునాయు డు వంచించారని వైఎస్సార్‌సీపీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి మండిపడ్డారు. మండలంలోని మైనారిటీ కాలనీలో మంగళవారం బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికి తిరిగి ప్రజలకు చంద్రబాబు మోసాలను వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎస్ భాస్కర్‌రెడ్డి, చిన్న, దిలీప్‌రెడ్డి, సురేష్ యాదవ్, ఎంపీటీసీలు, నిరంజన్‌రెడ్డి, చంద్ర, సుబ్బారెడ్డి, భాగ్యమ్మ, రవీంద్రారెడ్డి, చిన్నబాబు, ఉమామహేశ్వర్‌రెడ్డి, కేశవరెడ్డి, నిత్య, సీతారాం, జనార్దన్, చల్లా సుబ్బారెడ్డి, శివారెడ్డి భాస్కర్‌రెడ్డి, అన్వర్, అశ్రత్, వారిష్, జుమన్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టు కార్డుల ద్వారా సీఎంకు వినతులు



పోస్టుకార్డులను పోస్టు బాక్స్‌లో వేస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘ సభ్యులు

వేంపల్లె : భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన వివిధ సమస్యలను పరిష్కరించాలని సీఎం చంద్రబాబుకు పోస్టు కార్డుల ద్వారా వినతులను పంపించారు. మంగళవారం స్థానిక పోస్టాఫీస్‌లో పోస్ట్ బాక్స్‌లో కార్డులను వేశారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.రామాంజనేయులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంక్షేమ బోర్డు పునరుద్ధరిస్తామని, వివిధ సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారన్నారు. ఇటీవల సంక్షేమ బోర్డుకు చైర్మన్‌ను నియమించారన్నారు. అయితే క్లయిమ్స్ పరిష్కారం కోసం ప్రక్రియ ప్రారంభం కాలేదన్నారు. వెంటనే సంక్షేమ బోర్డుకు పాలకమండలిని ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో పనిచేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బ్యాంకులలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలి



మాట్లాడుతున్న అర్బన్ సీఐ చాంద్‌బాషా

పులివెందుల రూరల్ : అన్ని బ్యాంకులలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అర్బన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన అన్ని బ్యాంకుల మేనేజర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణంలోని బ్యాంకులలో దొంగతనాలు, ఏటీఎంలో చోరీలు జరగకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా బ్యాంకుల వద్ద, ఏటీఎంల వద్ద సెక్యూరిటీని ఏర్పాటు చేయాలన్నారు. అలాగే బ్యాంకులు, ఏటీఎంల వద్ద సీసీ కెమెరాల పనితీరు గురించి బ్యాంకు అధికారులతో చర్చించారు. ప్రతిరోజు బ్యాంకు మేనేజర్లు సీసీ కెమెరాలను పర్యవేక్షిస్తుండాలన్నారు. ఏవైనా సమస్యలుంటే పోలీసులకు తెలియజేయాలన్నారు. ముఖ్యంగా బ్యాంకుల వద్ద, ఏటీఎంల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలతోపాటు సెక్యూరిటీ గార్డ్స్‌ను నియమించాలన్నారు.

మాదకద్రవ్యాలు సేవించడం నేరమే

లింగాల : మాదక ద్రవ్యాలు అమ్మడమే కాదు... సేవించడం కూడా నేరమేనని ఏఎస్‌ఐ శేషయ్య తెలిపారు. మంగళవారం పెద్దకుడాల జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్నేహిత అమృతహస్తం సేవా సమితి ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నివారణపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అసాంఘిక కార్యక్రమాలు నివారించే దిశగా అడుగులు వేయడం విద్యార్థి దశ నుండే సాధ్యమవుతుందన్నారు. ఎంఈఓ రామకృష్ణయ్య మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, మత్తు పానీయలు గురించి నిత్యం చర్చించుకోవడం ద్వారా కూడా మాదక ద్రవ్యాలు అరికట్టేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నారు. అనంతరం వారు మాదక ద్రవ్యాల నివారణ పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం విద్యార్థులకు స్నేహిత అమృతహస్తం సేవా సమితి, లింగాల పీహెచ్‌సీల ఆధ్వర్యంలో రక్తహీనత, రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించి ఫలితాలను తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం వాసుదేవారెడ్డి, సేవా సమితి అధ్యక్షుడు రాజు, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ ఆసియా బేగం, వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా లో లెవెల్ బ్రిడ్జి

- పట్టించుకోని అధికారులు



సింహాద్రిపురం - వెలిదండ్ల ప్రధాన రహదారిలో ప్రమాదకరంగా ఉన్న లో లెవెల్ బ్రిడ్జి

సింహాద్రిపురం : మండలంలోని గురిజాల గ్రామ సమీపంలో వాగుకు ఉన్న లో లెవెల్ బ్రిడ్జి ప్రమాదకరంగా ఉంది. లో లెవెల్ బ్రిడ్జి వల్ల వాహనదారులకు ప్రమాదమని తెలిసినా కూడా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. ఈ రోడ్డు ఏదో మారుమూల పల్లె రోడ్డు కాదు.. నిత్యం ఎన్నో వాహనాలు తిరిగే సింహాద్రిపురం – వెల్లిదండ్ల ప్రధాన రోడ్డు. ఈ లో లెవెల్ బ్రిడ్జి వద్ద భారీ వర్షాలు పడి నప్పుడల్లా నీరు ఉధృతంగా ప్రవహించి పలు వాహనాలు కొట్టుకుపోయాయి. ఎలాంటి ప్రాణ నష్టం సంభవించకుండా గ్రామ ప్రజలు కాపాడారు. ప్రస్తుతం ఆ బ్రిడ్జికి పెద్ద రంధ్రం ఏర్పడి దిన దిన గండంగా మారింది. సంబంధిత అధికారులకు ఆ బ్రిడ్జి కనిపిస్తుందో, లేదో అర్థం కావడంలేదని ప్రజలు పేర్కొంటున్నారు. అయితే ఆ రంధ్రానికి ప్రజలే మట్టివేసి వాహనదారులకు కనిపించేటట్లు చేశారు. అయినా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ రోడ్డులో భారీ వాహనాలు వెళుతున్నప్పుడు బ్రిడ్జి కూలిపోయే ప్రమాదం ఉందన్నారు.